**కథ**

# సత్యభామ

సత్యవతి భర్త కృష్ణమూర్తి అమెరికా నుండి తిరిగొస్తున్నాడు!

అతను మూడేళ్ళ క్రిందట హెచ్‌వన్ వీసా మీద ఉద్యోగం కోసం వెళ్ళబోతూ దిగులుపడ్డ సత్యవతిని దగ్గరికి తీసుకుని–

''నేను కాస్త సెటిలవగానే మీరందరూ వచ్చేద్దురుగానీ– పిల్లల చదువులూ అక్కడైతే బావుంటాయని చెప్పారు. సరేనా?'' అన్నాడు. మౌనంగానే ఆమె తల వూపింది.

అతనెళ్ళిన పదిరోజులకి సత్యవతి అత్తగారు మంచం దిగబోతూ తూలిపడి కాలు విరిగింది. హడావిడి పడి ఆస్పత్రికి తీసుకెళ్తే, కనీసం నెలరోజులు ఆస్పత్రిలో ఉండాలని జాయిన్ చేసుకున్నారు. ఇటు ఇంట్లో పిల్లలకి వండి పెట్టి వాళ్ళని స్కూళ్ళకి పంపటం, ఆనక ఆస్పత్రికి పరుగులు పెట్టి అత్తగార్ని చూసుకోవటం ఈ రకంగా రోజులు బిజీగా గడిచాయి.

వీటికితోడు ఓరోజు మధ్యాహ్నం సత్యవతి ఆస్పత్రి నుండి ఇంట్లోకి అడుగుపెడుతుండగా లోపల్నించి దొంగ ఎదురయి ఆమెని చూసి క్షణం పాటు కంగారుపడి వెంటనే బలంగా తోసేసి పారిపోయాడు. ఒక్కసారిగా అలా తోసేసేసరికి సత్యవతి గోడ మీద పడి తలకి దెబ్బ తగిలింది.

ఆ మర్నాడు పోలీసులొచ్చి హడావిడి చేశారు. ఇంట్లో ఏ వస్తువూ పోలేదని చెప్పినా నమ్మక లక్ష ప్రశ్నల్ని యక్ష ప్రశ్నల్ని సంధించారు. ఎక్కడ చిల్లర దొంగలు పట్టుబడ్డా సత్యవతిని పిలిపించి తను చూసిన దొంగ వీళ్ళల్లో ఉన్నాడోలేదో చెప్పమని వొత్తిడి చేశారు. తలకి తగిలిన నొప్పి పోయిందికానీ ఈ తల నొప్పి మాత్రం తగ్గలేదు.

ఈ గొడవ కాస్త సద్దుమణిగేసరికి పిల్లల్ని స్కూల్‌కి తీసుకెళ్ళే ఆటోవాడు కాస్తా అకస్మాత్తుగా రావటం మానేశాడు. దాంతో రోజూ వేరే ఆటోలో పిల్లల్ని స్కూల్‌కి తీసుకెళ్ళి తీసుకొచ్చే డ్యూటీ అదనం అయింది.



**వారణాసి రామకృష్ణ**

ఓ రోజు స్కూల్ దగ్గర పరిచయం అయిన ఒకావిడ తన టూ వీలర్ వంక చూపి–

''మీరు కూడా బండి కొనుక్కోండి మేడమ్! ఆటోల గొడవ తప్పుతుంది'' అని చెప్పింది.

''కానీ నాకు బండి నడపటం రాదండి!''

''అదేమంత పెద్దపనా మేడమ్! నాల్రోజులు నేర్చుకుంటే వచ్చేస్తుంది. నా బండి ఇస్తాను. నేర్చుకోండి'' ఆవిడ ప్రోత్సహిస్తుంటే అవును ఇదేదో బావుందేమోననిపించింది.

అలా బండి నేర్చుకునే ప్రక్రియలో ఓరోజు బొక్కబోర్లా పడి మోకాలు బెణికింది!

ఇక సత్యవతి అవస్థ వర్ణనాతీతం! బాధల్ని మునిపంట నొక్కి చెయ్యాల్సిన పనుల్ని తప్పక చేసుకొచ్చింది. టూ వీలర్ నేర్చుకోవటం అన్న ముచ్చట అలా వాయిదా పడగానే కృష్ణమూర్తి ఫోన్ చేసి–

''సత్యా! ఒక గుడ్ న్యూస్!'' అన్నాడు.

అక్కడికెళ్ళటానికి టిక్కెట్లు, వీసా పంపుతున్నాడనుకుని ఆనందంతో ఉబ్బితబ్బిబ్బవుతూ–

''ఏ డేట్ ఫిక్స్ చేసారు?'' ఆత్రుతగా అడిగింది.

''డేట్ ఫిక్సా?'' ఆశ్చర్యంగా అన్నాడు.

''అదేనండీ మేము రావటానికి'' ఆమె చెప్పేలోగానే విషయం కృష్ణమూర్తికి అర్థం అయింది. వెంటనే కంఠం మారిపోయింది.

''సత్యా! ఇక్కడి పరిస్థితులేమీ బాగోలేవు. నా ఒక్కడికే కష్టంగా ఉంది. ఇక మీరందరూ వచ్చేస్తే మరింత ఇబ్బంది. పైగా ఇంకో ఏడాదిలోగా నేనే ఇండియా వచ్చేద్దామనుకుంటున్నాను'' భారంగా అతను చెబుతూంటే సత్యవతికి ఏం మాట్లాడాలో అర్థం కాలేదు.

మరో ఆరు నెలలు గడిచాక మళ్ళీ ఫోన్ చేసి

''సత్యా! ఉన్న ఉద్యోగం వదిలేసి ఇక్కడికొచ్చాను. తాడో పేడో తేల్చుకోవాల్సిందే. మరో కొత్త ఉద్యోగం దొరికింది. జీతం ఫర్వాలేదు. బానే వుంది. మరో రెండేళ్ళు ఇక్కడిలా కాలం గడిపి ఆ తర్వాత శాశ్వతంగా ఇండియా వచ్చేస్తాను! అందాక మనకీ బాధ తప్పదు!''

అంటుంటే ఉబికి వస్తున్న బాధని గొంతులోకి రానీకుండా నవ్వేసింది.

''సత్యా! విషయం చెప్పడం మరిచిపోయాను! మరో రెండు నెలల్లోపు చెక్ పంపుతాను. కానీ ఈలోగా నువ్వు కారు డ్రైవింగ్ నేర్చుకో!''

''కారు డ్రైవింగా?''

''అవును సత్యా! వెంటనే మనం కారు కొనుక్కుందాం! ఇలా ఒక్కో వస్తువు ఇప్పట్నించే సమకూర్చుకుంటే భవిష్యత్తులో ఇబ్బంది ఉండదు! సరేనా? నేర్చుకుంటావా?''

భర్త చెబుతుంటే కాదనలేకపోయింది.

కారు డ్రైవింగ్ బాగా వచ్చేశాక కారు కొన్నది. చాలావరకు శ్రమ తగ్గిన ఫీలింగ్!

కానీ కొత్త సమస్యలు పుట్టుకొచ్చేయి.

ఓరోజు జులాయి కుర్రాడొకడు మోటార్‌బైక్ మీద వేగంగా వస్తూ కావాలనే సత్యవతి కారుకి దగ్గరికి పోనిస్తూ టీజ్ చేశాడు.

సత్యవతి కంగారు పడేసరికి కారు రోడ్డు డివైడర్ని గుద్దేసింది.

వాడు వెకిలిగా నవ్వుతూ హేళన చేస్తూ వేగంగా వెళ్లిపోయాడు.

''ఇడియట్! బ్రూట్!!'' తిట్టుకుంటూ కారు దిగి చూస్తే- హెడ్‌లైట్స్ పగిలిపోయాయి.

బంపర్ మొత్తం పాడయిపోయింది. పైగా ట్రాఫిక్ పోలీసు వచ్చి నానా తిట్లు తిట్టాడు. కేసు బుక్ చేస్తానంటూ చిందులు త్రొక్కాడు.

అతనికి అసలు విషయం చెప్పి ఆకతాయి కుర్రాడి బైక్ నెంబరిచ్చి ఒప్పించేసరికి తలప్రాణం తోక్కొచ్చింది.

ఇబ్బందులు, సమస్యలు దాటుకుంటూ, ఒక్కొక్కటీ నేర్చుకుంటూ వెళ్తుంటే, ఇదిగో ఇలా భర్త తిరిగొస్తున్న వార్త వినగానే సత్యవతికి తెలియని ఉద్వేగంతో కన్నీళ్ళు ఉబికాయి.

''సత్యా! బాంబే ఎయిర్‌పోర్టు నుండి మాట్లాడుతున్నాను. ఆ! అవును! ఇండియాకి వచ్చేశాను. మరో కొన్ని గంటల్లో వచ్చేస్తున్నాను. కారు తీసుకుని ఎయిర్‌పోర్టుకి వస్తున్నావుకదూ!''

భర్త మాటలు చెవుల్లో అమృతం పోస్తుంటే సత్యవతి హుషారుగా ఎయిర్‌పోర్టుకెళ్ళింది. ప్లేన్ దిగివస్తున్న భర్తని చూడగానే తనకి తెలీకుండానే సంవత్సరాల కొద్దీ గుండెల్లో ఒదిగిన దుఃఖం ఒక్కసారిగా జలపాతంలా దూసుకురాగా- బలవంతంగా అనుభవాల ఆనకట్ట కట్టి లోనకట్టిపడేసింది!

ఆ మర్నాడు నరక చతుర్దశి!

కృష్ణమూర్తి పెద్ద సూట్కేసు ఓపెన్ చేసి తను తెచ్చిన వస్తువులన్నీ బైట పెట్టి ఒక్కొక్కటిగా అందరికీ ఇచ్చాడు. భార్యకోసం కొన్న చీర మాత్రం ఎంత వెతికినా కనిపించలేదు. దిగాలు మొహం పెట్టిన భర్తని చూసి-

''ఏమైందండి?'' సత్యవతి ప్రశ్నించింది.

''నీ కోసం కొన్న చీర ఏమైందో అర్థం కావటం లేదు సత్యా! అక్కడే మర్చిపోయి వచ్చేశాను''

భర్త అంటుంటే ఆమెకి తెలీకుండానే ఒక్కసారిగా గుండె భగ్గుమంది 'మర్చిపోయాను' అన్న మాట చెవుల్లో గింగుర్లెత్తి మనసు ఉడికిపోయింది.

సత్యవతి ఒక్కసారిగా బరెస్ట్ అయింది.

గాయాలు, బాధలు, కన్నీళ్ళు, అవమానాలు, అవహేళనలు... అన్నీ ఒక్కసారిగా పైకి ఉబికాయి.

కృష్ణమూర్తి నిశ్చేష్టుడై, నిర్ఘాంతపోయి విన్నాడు. ఒక్కమాట కూడా మాట్లాడకుండా మౌనంగా విన్నాడు.

ఫోన్‌లో ఒక్కసారి కూడా ఆమె తనెక్కడ బాధపడతాడోనన్న బెంగతోనే ఒక్క విషయం కూడా చెప్పలేదు. ఒంటరిగా సమస్యలతో పోరాడింది.

ఇంతలో కూతురు గదిలోకి దూసుకువచ్చి ''డాడీ!'' అని గట్టిగా పిలిచింది.

బాధతో, ఆవేశంతో ఊగిపోతున్న సత్యవతి గతుక్కుమని ఆగిపోయింది.

''డాడీ! ఇదేంటి? గౌననుకుని ప్యాకెట్ విప్పి చూస్తే ఇది ఉంది. నాకోసం చీర తెచ్చారేంటి?''

ఆశ్చర్యంతో నవ్వుతున్న కూతురి చేతిలోని చీరని చూశాక కృష్ణమూర్తికి ప్రాణం లేచి వచ్చింది. జరిగిన పొరపాటు అర్థమయింది. మౌనంగా అతను లేచి వెళ్ళిపోయాడు.

ఆరోజు సాయంత్రం- పిల్లలు అత్తగారు బైట దీపాలు వెలిగించే హడావిడిలో ఉన్నారు. ఊరంతా వెలుగులతో నిండింది. టపాశుల శబ్దాలతో సందడి నెలకొంది. కృష్ణమూర్తి కంప్యూటర్ దగ్గర కూర్చుని మెయిల్స్ పంపుతున్నాడు.

సత్యవతికి భర్త తనకోసం అపురూపంగా తీసుకొచ్చిన చీరని చూడగానే అపోహతో తను మాట్లాడిన మాటలు, అనవసరంగా పడిన ఆవేదన, కోపం అన్నీ గుర్తొచ్చి భర్తమీద ప్రేమ రెట్టింపయింది.

మౌనంగా, గంభీరంగా కూర్చున్న భర్త భుజం మీద తలవాల్చింది!

''మీరు తెచ్చే చీరకోసం ఎదురు చూడలేదు నేను. కానీ మీరు నాకోసం తెచ్చిన వస్తువు కనిపించలేదనేసరికి, మరిచిపోయాను అనేసరికి నామీద మీకేర్పడ్డ నిర్లక్ష్యానికి కోపం వచ్చి అలా మాట్లాడానే తప్ప ఇదంతా నిజంగా కాదు. పైగా మీ పరోక్షంలో పడ్డ బాధలు, నరకయాతన నన్నలా మాట్లాడించాయి. ప్లీజ్. నన్ను క్షమించరూ!''

కన్నీటి చెలియలికట్ట తెగింది. కృష్ణమూర్తి ఆమెని హృదయానికి హత్తుకున్నాడు. నిజమే. తను లేకపోయేసరికి ఆమె ఎన్ని బాధ్యతల్ని తలకెత్తుకుంది! డబ్బు సంపాదనే ధ్యేయంగా ఒక రకంగా కుటుంబ బాధ్యతల నుంచి తను పలాయనం చేశాడు.

''లేదు సత్యా! ఆనాడు స్పృహ కోల్పోయిన భర్తని చూసి అధైర్యపడక సత్యభామ నరకుడితో పోరి విజయం సాధించింది. ఇవాళ నీలాంటి స్త్రీలెందరో సంపాదనా స్పృహలో పడిన భర్తలు కుటుంబం మరిచిపోతే తమ రెండు చేతుల్నే నాలుగు చేతులు చేస్కుని శక్తి స్వరూపిణిగా నిత్యం నరకయాతనల యుద్ధం చేస్తున్నారు. నిజానికి నువ్వే నన్ను క్షమించాలి!''

మనస్ఫూర్తిగా చెబుతున్న కృష్ణమూర్తిలో ప్రేమ ఉప్పొంగుతోంది. అతని వర్ణనకి సత్యవతికి నవ్వొచ్చి కిలకిలమని నవ్వింది.

ఆమె కళ్ళల్లో తెల్లారితే వచ్చే- దీపావళి సంబరం!

★

